# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 68 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 6-6 -2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ


- నేటి విచారణకు హాజరు కానున్న ఎంపీ ఈటల
- 9న హరీష్ రావు, 11న కేసీఆర్ విచారణకు హాజరు

హైదరాబాద్
తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాజకీయ నాయకులకు కూడా నోటీసులు ఇచ్చింది. వీరిని విచారించేందుకు గురువారం కాళేశ్వరం కమిషన్ హైదరాబాద్ కు చేరుకుంది. విచారణలో భాగంగా శుక్రవారం బిజెపి ఎంపి ఈటల

-మిగతా 2 లో

- ఉద్యోగుల డిఎ తదితర డిమాండ్లపై సానుకూలత
- ములుగులో పామాయిల్ ఫ్యాక్టరీకి 12 ఎకరాల భూమి
- కేబినేట్‌లో పలు అంశాలపై సుదీర్ఘ చర్చలు

# స్థానిక ఎన్నికలకు కేబినేట్ ఆమోదం



### నెలాఖరులోగా లేదా జూలైలో స్థానిక ఎన్నికల నిర్వహణ

హైదరాబాద్ జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):
స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగానే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలాఖరులోగా లేదా జూలై ఎన్నికల నిర్వహణపై కసరత్తు చేసారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రిమండలితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. కేబినెట్‌లో ప్రధానంగా లోకల్

-మిగతా 2 లో





## పేదల జీవితాలను మార్చేశాం

- 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాం
- ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ వెల్లడి

న్యూఢిల్లీ,జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):
పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం

-మిగతా 2 లో



## ట్రంప్ X మస్క్..

నిన్నటివరకు మిత్రులు.. నేడు విరోధులు

'బ్రేకప్'కు కారణమైన ట్యాక్స్ బ్రేక్ బిల్లు

హైదరాబాద్
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య స్నేహబంధం చెడినట్టే కనిపిస్తున్నది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. డోజ్ బాధ్యతల నుంచి వైదొలగడానికి ముందే వీరిద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని నివేదికలు చెప్తున్నాయి. దానికి ప్రధానంగా ఐదు కారణాలు ఉన్నట్టు శ్వేతసౌధం వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**బిగ్ ట్యాక్స్ బ్రేక్ బిల్లు:** అమెరికన్లకు పన్ను తగ్గించేందుకు ఈ బిల్లును తీసుకొచ్చారు. ట్రంప్-మస్క్ మధ్య దూరానికి ఈ బిల్లే ప్రధాన కారణమని చెప్తున్నారు. ఈ బిల్లుతో ధనికులకు 4.5 లక్షల కోట్ల డాలర్ల మేర లబ్ధి చేకూరి, పేదలకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలు మరుగున పడుతాయని మస్క్ తప్పుబడుతున్నారు. ఇదో అసహ్యకరమైన బిల్లుగా ఆయన అభివర్ణించారు. రుణ పరిమితిని పెంచి అమెరికా

-మిగతా 2 లో



## బడా బాబుల కోసం బీద రైతుల కడుపు కొడుతారా.?

- ఇంకా ఎన్ని రకాలుగా రైతులను గోసపెడుతావ్ రేవంత్
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ తప్పుపట్టినా బుద్ధి రాలేదు
- రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషం
- రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

హైదరాబాద్ జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):
బీద రైతుల కడుపుకొట్టి, బడా పారిశ్రామిక వేత్తలకు భూములను కారుచౌకగా కట్టబెట్టడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిపోయింది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనకు నచ్చిన బడాబాబుల

-మిగతా 2 లో

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

### ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత సింహాచలం మృతి

- నెలలోపే నంబాల తరవాత మరో అగ్రనేత హతం
- నరసింహాచలం పై కోటి రివార్డు ఉన్నట్లు పోలీసుల ప్రకటన

రాయ్‌పూర్,జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):
మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు టెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ గౌతమ్ ఉన్నారు. ఆయన తలపై రూ. కోటి రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు కీలక మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. జిల్లాలో విస్తరించిన నేషనల్

-మిగతా 2 లో



## ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సీరియస్

- హుటాహుటిన ఏఐజీ ఆస్పత్రికి తరలింపు
- ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్న హరీష్ రావు

హైదరాబాద్ జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):
హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను వెంటనే గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. గుండె సంబంధిత సమస్యతో అస్వస్థతకు గురైనట్టు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకంగా ఉన్నట్టు సమాచారం. మాజీ మంత్రి హరీశ్‌రావు,

-మిగతా 2 లో



### ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్ణయం

## హర్షనీయం..!



-రెండు డీఏలకు ఒకే చెప్పిన ప్రభుత్వం -ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్
-ఆరోగ్య పథకం అమలు కోసం ట్రస్ట్ ఏర్పాటు
-ప్రభుత్వ పెద్దలకు కృతజతలు తెలిపిన ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి...

హైదరాబాద్, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):
ఉద్యోగుల విషయంలో రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయాల పట్ల తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం వరాలను ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి

-మిగతా 2 లో

# స్థానిక ఎన్నికలకు కేబినేట్ ఆమోదం

(మొదటి పేజి తరువాయి)

బాడీ ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈనెల చివరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వర్షాకాలం నేపథ్యంలో జూన్, జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణ సాధ్యాసాధ్యాలపై చర్చించారు. అలాగే కాళేశ్వరంపై 300 పేజీల ఎన్డీఎస్ఏ రిపోర్ట్, 150 పేజీల విజిలెన్స్ రిపోర్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇచ్చారు. రిపోర్ట్‌పై మంత్రుల అభిప్రాయాలను సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకున్నారు. ఏపీలో పరిశ్రామికాభివృద్ధికి వివిధ జిల్లాల్లో ప్రభుత్వ భూములను బదిలీ చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. స్పెషల్ ఎక్సైజ్ సెస్ అమలు చేయాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాశాఖలో మరో డైరెక్టర్ నియామకం చేపట్టాలని మంత్రి మండలి నిర్ణయించింది. విద్యుత్ శాఖలో 300 పోస్టుల క్రియేషన్‌కు ఆమోదించింది. ఉద్యోగుల డిమాండ్లపై సుదీర్ఘంగా తెలంగాణ కేబినెట్ చర్చించింది. అధికారుల కమిటీ నివేదికపై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, ఆరోగ్య భద్రత సహా.. పెండింగ్ బిల్లుల అంశాల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ అథారిటీ– ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మహిళా సంఘాలకు బీమా నిధుల విడుదలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ములుగులో పామాయిల్ ఫ్యాక్టరీకి 12 ఎకరాల భూమిని కేటాయిస్తూ కేబినెట్ ఆమోదించింది. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నామకరణం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీ– కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కేరాఫ్‌గా కొత్తగూడెం నిలిచింది. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీతో తెలంగాణ ఖ్యాతి పెరుగనుంది. ఈ సందర్భగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ– సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.

# బడా బాబుల కోసం బీద రైతుల కడుపు కొడుతారా.?

(మొదటి పేజి తరువాయి)

కోసం 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ భూములను బలవంతంగా సేకరించే భాద్యతను సీఎం భుజాన వేసుకోవడంతో రైతులపై తరచుగా ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు లాఠీలు ప్రయోగిస్తున్నారు అని మండిపడ్డారు.నిన్న జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ బౌన్సర్లతో పాటు పోలీసులు కూడా రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషం. పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. తన జిల్లాలోనే ఘటన జరిగి 24 గంటలు అవుతున్నా స్పందించరా? పోలీసులు 12 గ్రామాల రైతులను కొట్టి, 40 మందిపై కేసులు పెట్టి, 12 మందిని రిమాండ్‌కి పంపించడం దుర్మార్గం అని మండిపడ్డారు. రైతులను కొట్టించిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమానిపై కానీ, బౌన్సర్లపై కానీ ఎందుకు కేసులు పెటలేదో చెప్పాలని రేవంత్ సర్కారుని ప్రశ్నిస్తున్నా? కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ఇలాంటి ఘటనలు ఎన్ని జరిగినాయి రేవంత్ రెడ్డి? లగచర్లలో ఫార్మా కంపెనీని వ్యతిరేకించిన లంబాడా రైతులకు బేడీలు వేసిన ఘటనపై కేంద్ర మానవ హక్కుల సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ తప్పుపట్టినా బుద్ధి రాలేదు. నిర్మల్ జిల్లా దిలావర్పూర్ లో కూడా ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించిన రైతులను కొట్టారు. మీ రియల్ ఎస్టేట్ దందాలు పెంచుకోవడానికి 6 లైన్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్ విషయంలో కూడా రైతులపై కేసులు పెట్టినవ్. మేము అధికారంలోకి వస్తే ఫార్మా సిటీ భూములు తిరిగిస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చి తిరిగి అదే రైతులపై కేసులు పెట్టినవ్. జహీరాబాద్ న్యాలకల్ రైతులపై విచక్షణారహితంగా దాడి చేసి అక్రమ కేసులు పెట్టించినవ్. సూర్యాపేట జిల్లా చిలకలూరు గ్రామం రైతులు రుణమాఫీ కాలేదని ప్రశ్నిస్తే 42 మందిపై కేసులు పెట్టి పోలీస్ జులుం చూపించినవ్. ధాన్యం కోతలను ప్రశ్నించినందుకు నిర్మల్ జిల్లా ఏర్వచింతలో రైతులపై కేసులు పెట్టించినవ్. ఇంకా ఎన్ని రకాలుగా రైతులను గోసపెడుతావ్ రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ౦ైతులకు, ప్రజలకు పనికి వచ్చే ఒక్క పని చేయడం లేదు కానీ, పెద్దలకు మాత్రం భూములను కట్టబెడుతవ్. రైతులను కొట్టు.. కమిషన్లు పట్టు అనే విధంగా సాగుతుంది నీ పాలన. తెలంగాణ రైతు లోకం తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదు. అరెస్ట్ చేసిన పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

(మొదటి పేజి తరువాయి)

పార్క్‌లో కాల్పులు కొనసాగుతున్నాయి. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భారీగా మావోయిస్టులు ఉన్నట్లు– భద్రతా బలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం ఆయన స్వగ్రామం. కాగా, ఈ ఘటనలో పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



మావోయిస్టు అగ్రనాయకుడు నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు– లక్ష్మీ నరసింహాచలం మృతిచెందాడు. అతడు సుధాకర్‌గా పార్టీలో ప్రసిద్ధి చెందాడు. అతడికి గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ రామరాజు, సోమన్న అనే మారు పేర్లు ఉన్నాయి. ఆయన స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం. గత 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సుధాకర్‌పై రూ. కోటి రివార్డు ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఇంద్రావతి –టైగర్ రిజర్వ్‌లో మావోయిస్టు సీనియర్ నేతలు ఉన్నట్లు భద్రతా దళాలకు పక్కా సమాచారం అందడంతో.. డీఆర్‌జీ, ఎస్‌టీ–ఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి తనిఖీలు మొదలుపెట్టాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున దళాలు–మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ నేలకొరిగినట్టు సమాచారం. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. అయితే సుధాకర్ మృతికి సంబంధించి ఎటువంటి ప్రకటను ఆయన జారీ
చేయలేదు. బీజాపూర్ అడవుల్లో సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆరునెలల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ–కి చెందిన ముగ్గురు నాయకులను దళాలు ఎన్‌కౌంటర్ చేయడం గమనార్హం. ఇక తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ– సీనియర్ లీడర్ పాపారావు కూడా అక్కడే ఉన్నట్లు తమకు సమాచారం అందినట్లు– బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ప్రకటన జారీ చేశారు. ప్రకాశ్ మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లో కార్యకలాపాలను పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇతడిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్ర నిపుణుడు. ఉచ్చులు పన్నడంలో దిట్టగా పేరుంది. చాలా ఐఈడీ ఇతర దాడుల్లో అతడు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నాడు. అతడిపై రూ.20లక్షల రివార్డు ఉంది. వీరిద్దరికి సంబంధించిన సమాచారం వెల్లడి కాలేదు. కేవలం మూడు వారాల వ్యవధిలో అగ్రనేతలను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా చత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతిచెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోలు లొంగిపోయారు. మరోవైపు ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్ణయం హర్షానీయం..!

(మొదటి పేజి తరువాయి)

భట్టివిక్రమార్కకు, ఇతర ప్రభుత్వ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై ఐఏఎస్‌లతో ఏర్పాటు చేసిన త్రి సభ్య కమిటీకి తెలంగాణ ఉద్యోగుల జేఏసీగా ఇచ్చిన ప్రతి అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. జేఏసీ ఏదైతే ఉద్యోగుల కోసం కావాలని కోరిందే అదే అంశాలపై రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయం తీసుకోవడం గొప్ప విజయంగా పేర్కొన్నారు. ఉద్యోగులకు రెండు డీఏలను ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. దీనిలో ఒక డీఏ తక్షణమే, మరో డీఏ 6 నెలలలో ఇవ్వనుందన్నారు.



ఇదే కాకుండా ఎన్నికల సమయంలో జరిగిన ఉద్యోగుల బదిలీలను తిరిగి సొంత జిల్లాలకు పోయే అవకాశం కల్పించిందన్నారు. దీంతో సుమారు రెండేళ్లుగా ఎదురు చూసే ఉద్యోగులకు గొప్ప అవకాశం లభించిందన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం ప్రతి నెల రూ.700 కోట్లు తగ్గకుండా క్లీయర్ చేసేందుకు అంగీకారం తెలిపిందన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగుల హెల్త్ స్కీం కోసం ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని జేఏసీనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిందన్నారు. ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వ పెద్దలు రాష్ట్రంలోని ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య పథకాన్ని అమలు చేసేందుకు ట్రస్ట్‌ను ఏర్పాటు చేయబోతుందన్నారు.

# నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

(మొదటి పేజి తరువాయి)

రాజేందర్ ను ప్రశ్నించనుంది. తర్వాత ఈనెల 9న బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు.. 11న మాజి సిఎం కెసిఆర్ ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన నుంచి ప్రారంభోత్సవం వరకు జరిగిన అన్ని అంశాలపై ప్రశ్నల వర్షం కురుపించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతలోపాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ శుక్రవారం నుంచి రాజకీయ ప్రతినిధులను విచారించనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక అంశాలు వంటి వాటిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజినీర్లను, రిటైర్డ్ ఇంజినీర్లను, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి అఫిడవిట్లను స్వీకరించి వాటి ఆధారంగా జస్టిస్ పిసి ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా కంట్రోలర్ అండ్ అడిటర్ జనరల్(కాగ్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ–(ఎన్‌డిఎస్ఎ) నివేదికలను కూడా కమిషన్ పరిగణలోకి తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్‌ను శుక్రవారం కమిషన్ ముందు హాజరుకానున్నారు. ఈనెల 9వ తేదీ సోమవారం రోజున నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కమిషన్ ముందుకు రానున్నారు. ఈనెల 11వ తేదీ బుధవారం రోజున మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా కమిషన్ విచారించనున్నది. రాజకీయప్రతినిధుల విచారణలు తదుపరి కమిషన్ తుది నివేదికను ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి అందజేస్తుంది.

# పేదల జీవితాలను మార్చేశాం

(మొదటి పేజి తరువాయి)

నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తి కానుంది. దీంతో ఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది. ఈసందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మంత్రివర్గ సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశిరచుకొని.. వాటిని సాధించేందుకు ఉత్సాహంగా పనిచేయాలని సహచరులకు సూచించారు. ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

# ట్రంప్ X మస్క్..

(మొదటి పేజి తరువాయి)

ఆర్థికాన్ని దివాలా తీయించేలా ఉన్న ఇలాంటి బిల్లుకు మద్దతిచ్చిన వారికి సిగ్గు ఉండాలని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'కిల్ ది బిల్' అంటూ ట్వీట్ చేశారు. అయితే, ఎలక్ట్రిక్ కార్లకు రాయితీ తగ్గింపు అంశం బిల్లులో ఉండటం వల్లే మస్క్ దీన్ని వ్యతిరేకిస్తున్నారని ట్రంప్ వర్గం ఎదురుదాడికి దిగుతున్నది.

**ఆల్ట్‌మన్‌తో భేటీ:** మస్క్‌కు ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌కు మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఓపెన్‌ఏఐకు చెందిన చాట్‌బాట్ చాట్‌జీపీటీకి పోటీగా మస్క్ గ్రోక్‌ను తీసుకొచ్చారు. అయితే, తనను కాదని ఆల్ట్‌మన్‌తో ట్రంప్ ప్రైవేట్‌గా భేటీ కావడం మస్క్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది.

**మస్క్‌పై పర్యవేక్షణ:** డోజ్‌లో సభ్యుడిగా ఉన్న కొత్తలో శ్వేతసౌధానికి తరచూ వచ్చే మస్క్.. ట్రంప్‌తో అభిప్రాయభేదాలు మొదలైన తర్వాత వైట్‌హౌస్‌కు రావడాన్ని తగ్గించారు. ఇదే విషయమై అధ్యక్షుడు సూచనలు చేసినా ఆయన వైఖరి మారలేదు. దీంతో మస్క్‌కు అప్పజెప్పిన బాధ్యతలను పర్యవేక్షించడానికి, తనకు వివరాలు ఇవ్వడానికి ట్రంప్ మరో అధికారిని నియమించారు. ఇది మస్క్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది.

**పార్టీలోనూ వ్యతిరేకత:** ప్రభుత్వ వృథా ఖర్చు తగ్గింపునకు తొలుత మస్క్ ఇచ్చిన సూచనలను ట్రంప్ సహా పార్టీ సభ్యులు కూడా హర్షించారు. అయితే, రాజకీయ విషయాల్లోనూ మస్క్ జోక్యం చేసుకోవడం, నిబంధనలు కఠినతరం చేయడం అటు పార్టీలో, ఇటు ప్రజల్లోనూ విమర్శలను తీసుకొచ్చింది. దీంతో మస్క్ అధికారాలకు ట్రంప్ అనధికారికంగా కోత విధించారు. ఇదే సమయంలో డోజ్‌లో మస్క్ పదవీకాలం కూడా పూర్తైంది.

# ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సీరియస్

(మొదటి పేజి తరువాయి)

పలువురు భారాస నేతలు ఏఐజీ ఆసుపత్రికి చేరుకుని గోపీనాథ్ ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స కొనసాగుతోందని హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుతం మాగంటి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు– సమాచారం. ఏఐజీ ఆస్పత్రి వర్గాలు హెల్త్ బులిటెన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రి పాలయ్యారని తెలియటంతో మాజీ మంత్రి హరీష్ రావుతోపాటు– పలువురు బీఆర్ఎస్ నేతలు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మాగంటి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిపై హరీష్ రావు స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే మాగంటి ఐసీయూలో ఉన్నారు. ఆయనకు చికిత్స కొనసాగుతోందని తెలిపారు.

## 2025 జూన్ 6, శుక్రవారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
మాసం: జ్యేష్ఠమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం

తిథి
ఏకాదశి: జూన్ 6, తెల్లవారుజామున 2:16 నుండి జూన్ 7, తెల్లవారుజామున 4:48 వరకు
ద్వాదశి: జూన్ 7, తెల్లవారుజామున 4:48 నుండి జూన్ 8, ఉదయం 7:18 వరకు

నక్షత్రం
హస్త: జూన్ 5, తెల్లవారుజామున 3:35 నుండి జూన్ 6, ఉదయం 6:33 వరకు
చిత్రా: జూన్ 6, ఉదయం 6:33 నుండి జూన్ 7, ఉదయం 9:39 వరకు

సూర్యోదయం -సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:45
సూర్యాస్తమయం: సాయంత్రం 6:44

చంద్రోదయం - చంద్రాస్తమయం
చంద్రోదయం: మధ్యాహ్నం 12:12
చంద్రాస్తమయం: రాత్రి 1:19

శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:08 నుండి 4:56 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:48 నుండి 12:40 వరకు
అమృతకాలం: రాత్రి 2:26 నుండి 4:14 వరకు

అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 10:43 నుండి మధ్యాహ్నం 12:20 వరకు
యమగండం: మధ్యాహ్నం 3:30 నుండి సాయంత్రం 5:07 వరకు
గులిక కాలం: ఉదయం 7:28 నుండి 9:05 వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 8:25 నుండి 9:15 వరకు
మధ్యాహ్నం 12:38 నుండి 1:29 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 1:02 నుండి 2:50 వరకు

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**-టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**



**కడ్తాల్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చెట్లను పెంచి కాలుష్యాన్ని నివారించాలని టిపిసిసి సభ్యులు, ఆమనగల్లు మాజీ సింగల్ విండో చైర్మన్ ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు సభవత్ బిచ్య నాయక్ అధికారులు నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీల ద్వారా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి గ్రామంలో హరిత తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా వివాహ వేడుకలకు ఆరుబయట జ్ఞాపకంగా ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం పట్టణీకరణతో సిమెంట్, బీటీ రోడ్లు పెరిగాయని బహుళ అంతస్తులు ఎక్కువయ్యాయి వర్షం పడితే భూమిలోకి నీరు ఇంకే పరిస్థితి లేదు. ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని భూతాపంతో వాతావరణంలో అనేక మార్పులు ఏర్పడుతున్నాయి ఎవరికి వారే నాకెందుకు అనేవారు.. అధికమయ్యారు ఇలాంటి పరిస్థితుల్లో పర్యావరణానికి మనందరం మేలు చేయాలని అందుకోసమే మొక్కలు నాటి వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు హిరాసింగ్, తులసి రామ్ నాయక్, సాయికుమార్, కార్యదర్శి జంగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, బిచ్య, చందు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టం-2025 అమలుతో భూ సమస్యల శాశ్వత పరిష్కారం

**- జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**



**శంషాబాద్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం-2025 అమలు చేస్తోంది. ఈ నూతన చట్టం ప్రకారం, రైతులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. గొల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, భూ రికార్డులలో పేరుప్రకారం తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూముల సమస్యలు, భూ స్వభావం మార్పులు తదితర అంశాలను వివరించారు. ఈ నూతన చట్టం ద్వారా సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కుల జారీ, సాదాబైనామా కేసుల పరిష్కారం, హద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల నవీకరణ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆగస్టు 14వ తేదీ లోపు భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ంవెన్యూ బృందాలు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించనున్నాయి. రైతులు, ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని,దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం, భూ వివాదాల పరిష్కారానికి సహకరించాలి అని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్ నగర్ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**గోపాలపేట,జూన్ 05( నీలగిరి ఎక్స్ ప్రెస్):** గోపాలపేట మండలం పొల్కేపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త పిట్టల రాముడు పిట్టల బొక్కమ్మ గారి కుమారుడి వివాహానికి గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడీ మేఘారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.హిందూ సాంప్రదాయంలో వివాహానికి చాలా ప్రత్యేకత ఉంటుందని నేడు దంపతులయ్యే ప్రతి ఒక్కరు వారి వారి జీవితాల్లో సక్సెస్ సాధించాలని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో గోపాలపేట సత్య శీలా రెడ్డి, మణిగిల్ల తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ర్యాలీ




**కరీంనగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్వదేశీ జాగరన్ మంచ్ , వాకర్స్ ఆధ్వర్యంలో గురువారం రోజున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం కరీంనగర్లో పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు.. ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా వచ్చే వివిధ రకాల వ్యాధులు మానవ మనగడకే ప్రమాదకరమని, అలాగే చెట్లను నాటిపచ్చదనాన్ని పెంపొందించుకుంటే పర్యావరణాన్ని కాపాడవచ్చని వారు ఈ సందర్భంగా తెలిపారు .. ఈ సందర్భంగా స్టేడియం లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కన్వీనర్ సిఏ హరీష్ బాబు , వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుడిపాటి రమణారెడ్డి, అన్నమనేని సుధాకర్ రావు ,డాక్టర్ అమర్నాథ్ పెంచాల కిషన్ రావు, హార్ట్ ఫీట్ వాకర అసోసియేషన్ ప్రవీణ్ ,యోగా కోచ్ కిష్టయ్య, శ్రీరామ మహర్షి ,యోగ గురువు కుమార్ మహర్షి , వైశ్య సేవా కేంద్రం అధ్యక్షులు చిదురు సురేష్ పెద్ద సంఖ్యలో వాకర్స్ పాల్గొన్నారు.

## కరీంనగర్ డీ లిమిటేషన్ ముసాయిదా పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసిన బీజేపీ



**కరీంనగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ నగరపాలక సంస్థను 66 డివిజన్లుగా విభజించిన డీ లిమిటేషన్ ముసాయిదా పూర్తిగా అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉందని బీజేపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ప్రతిపక్షాన్ని దెబ్బతీసేందుకు కుట్రపూరితంగా డివిజన్ల విభజన చేశాయని ఆరోపించారు. బలమైన ప్రతిపక్షం ఉన్నచోటే డివిజన్లను విభజించి,ప్రత్యర్థులను ఎదుర్కోలేక కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు డీ లిమిటేషన్ ప్రక్రియలో రాజకీయ కుట్రలు చేశాయని మండిపడ్డారు. కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించారని,స్మార్ట్ సిటీ నిధులు, అమృత్ పథకం ద్వారా నగరాన్ని అభివృద్ధి చేశారని బీజేపీ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేక,డివిజన్లను అనుకూలంగా విభజించి బీజేపీని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ నేతలు డివిజన్ల విభజనను శాస్త్రీయంగా, చట్టబద్ధంగా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఈ ముసాయిదాను సవరించాలని, లిలిప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యాయబద్ధంగా డీ లిమిటేషన్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బడి బాటను విజయవంతం చేద్దాం.!

**-ఉపాధ్యాయులకు టి.ఆర్.టి.ఎఫ్ పిలుపు**

**హైదరాబాద్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్రంలో బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి తలపెట్టిన బృహత్తర కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట లో ఉపాధ్యాయులందరం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేద్దామని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ టి ఆర్ టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి లు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ జూన్ 6 నుండి ప్రారంభమవుతున్న బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మెరుగైన వసతులను, అందిస్తున్న నాణ్యమైన విద్య వంటి అంశాలను ప్రజలకు, పిల్లల తల్లిదండ్రులకు , గ్రామ పెద్దలకు అందరికీ వివరించి పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని కోరారు. ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థుల సంఖ్యతోనే ఉపాధ్యాయుల ఔన్నత్యం ఇనుమడింపబడుతుందని ఆ దిశగా మన ప్రయత్నాలు కొనసాగిద్దామని కోరారు.

## వెలువర్తిలో రేషన్ డీలర్ దౌర్జన్యాన్ని అరికట్టాలి



**జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్) వలిగొండ (ప్రతినిధి)** మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలోని రేషన్ షాపు డీలర్ కడవేరి నరసింహ వారి ఇంట్లో రేషన్ షాప్ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తుండడమే కాకుండా ఆయన సోదరుడు కడవేరి యాదగిరి రేషన్ బియ్యాని తీసుకోవడానికి వచ్చిన బూడిద గీతపై కులం పేరుతో దూషిస్తూ బూతులు తిడుతూ ఇంట్లో నుంచి బయటికి నెట్టేయడంతో ఎడమ చేయి వేలుకు తీవ్రంగా గాయమైంది ఈ సందర్భంగా మీడియా ద్వారా రేషన్ డీలర్ పై వెంటనే చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని బూడిద రాజ్ కుమార్ గీత దంపతులు అధికారులను వేడుకున్నారు

# డ్రగ్స్ కు అడ్డగా మారిన షాద్ నగర్

డ్రగ్స్ కు కేంద్ర బిందువుగా మారుతున్న షాద్ నగర్

-రాష్ట్రంలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడ్డ మూలాలు మాత్రం ఇక్కడే

-నాటి వరకు యువకులే అనుకుంటే నేడు ప్రభుత్వ ఉద్యోగులు సైతం డ్రగ్స్ తో వ్యాపారం

-కోట్లల్లో డ్రగ్స్ ను సరఫరా చేస్తున్న వారిలో ప్రభుత్వ ఉద్యోగులే ఎక్కువ

-ఈ మత్తు పదార్థాల అక్రమ దందాకు ముగింపు లభించేనా..?




**షాద్ నగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటుంటే మరోవైపు కోట్లల్లో డ్రగ్స్ పట్టుబడటం కలకలం రేపుతుంది. ఇటీవల కాలంలో షాద్ నగర్ 44వ జాతీయ రహదారి టోల్గేట్ సమీపంలోని ధాబాలో సుమారు మూడు కోట్లకు పైగా విలువచేసే డ్రగ్స్ పట్టుబడడంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురికాక తప్పదు. నిత్యం అధికారులు డ్రగ్స్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పదేపదే పత్రికా ప్రకటనలు, మీడియా ముఖంగా చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదనేది నగ్నసత్యం. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడిన అందుకు సంబంధించిన మూలాలు మాత్రం షాద్ నగర్ లో కనిపిస్తాయని నగ్న సత్యాలు మనమందరం గ్రహించాల్సిందే. షాద్ నగర్ మినీ ఇండియా గా పేరు ఉన్నప్పటికీ దేశంలోని 29 రాష్ట్రాల ప్రజలు షాద్ నగర్ ప్రాంతంలో ఉన్నారంటే ఆశ్చర్య పోవాల్సిన అవసరం ఏమీ లేదు. వివిధ రాష్ట్రాల నుండి నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రజలు అదే అడ్డుగా పెట్టుకొని డ్రగ్స్ సరఫరాకు పెద్ద ఎత్తున పావులు కదుపుతున్నారు. తాజాగా షాద్ నగర్ పట్టణంలోని ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ సైతం డ్రగ్స్ సరఫరా లో కీలక పాత్ర పోషించారని విషయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఇప్పటికే స్థానిక పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నాటి వరకు యువతనే డ్రగ్స్ ను సరఫరా చేయడంతో పాటు బానిసలుగా ఉండేవారు.. కానీ నేడు ప్రభుత్వ ఉద్యోగులు సైతం అక్రమంగా డ్రగ్స్ ను ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఇలాంటి అక్రమ దందాకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ డ్రగ్స్ కు కేంద్ర బిందువుగా మారుతున్న షాద్ నగర్ ప్రాంతంపై ఉన్నతాధికారులు మరింత దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని, అక్రమ డ్రగ్స్ సరఫరాకు, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.

అన్నివేళలా మీతో పాటు ఉంటుంది

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

## షాద్ నగర్ 2లెవెల్ చదరంగం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించిన ఏసీపీ లక్ష్మీనారాయణ

-ఏసీపీ లక్ష్మీనారాయణ ను శాలువాతో సన్మానించిన నిర్వాహకుడు వానరాసి జగన్

-జన్మదినం సందర్భంగా వానరాసి జగన్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఏసీపీ లక్ష్మీనారాయణ



**షాద్ నగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మల్లికార్జున కాలనీలోని పతాంజలి యోగ మందిర హాల్ లో జరిగిన షాద్ నగర్ 2లెవెల్ చెస్ టోర్నమెంట్ 2025 లో షాద్ నగర్ చెస్ అకాడమీ నిర్వాకులు వానరసి జగన్ నిర్వహించిన టోర్నమెంట్ లో షాద్ నగర్ పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 07, 09, 11, 13, 15,17 విభాగలో సుమీత్ కుమార్, ఈశాని, ఆర్యమాన్, కార్తికేయ, శ్రీహర్షిత్, సాత్విక్, శ్రీ వర్ధన్ గౌడ్, భాను తేజ, సిరి వల్లి, చదరంగం క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి, గెలుపొందిన క్రీడాకారులను షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్ లు, గోల్డ్ మెడల్స్, ట్రోఫీస్ అందజేశారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మెదడుకు పదును పెట్టాలంటే చెస్ ఆడాలని, చెస్ ఆడడం వలన జ్ఞాపకశక్తి పెరుగుతుందని పిల్లలు చురుకుగా తయారు అవుతారని, విద్యలో ముందంజలో ఉంటారని, పరీక్షలలో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. అనంతరం చెస్ కోచ్ వానరాసి జగన్ జన్మదిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి ఏసిపి లక్ష్మీనారాయణ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్.



**కరీంనగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఇటీవల జరిగిన సిపిఐ జిల్లా మహాసభలో నూతనంగా సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పంజాల శ్రీనివాస్ ను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కి పరిచయం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ ను పంజాల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. పంజాల శ్రీనివాస్ విద్యార్థి దశ నుండే చురుకైన వాడని,విద్యార్థి,యువజన రంగాలలో పనిచేసి,పార్టీ లో జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగాడని ప్రజా సమస్యల పై అధికారులు కలిసినప్పుడు స్పందించాలని కలెక్టర్ ను వెంకటరెడ్డి కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

## రైతు మహోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపి.



**హైదరాబాద్, జూన్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**


రేపటి నుండి మూడు రోజుల పాటు జరిగే రైతు మహోత్సవాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి అన్నారు.

సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైతు మహోత్సవానికి సంబందించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయన్నారు. రేపు ఉదయం 10:30 గంటలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రైతు కమిషన్ సభ్యులు భవానీ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల స్టాల్స్ తోపాటు బ్యాంకులు, ఎఫ్ పి వోలు, స్టార్టప్ కంపెనీలు, వ్యవసాయ అనుబంధ రంగాల స్టాల్స్ అన్ని కలిపి దాదాపు 150కి పైగా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అంతేకాదు మూడు రోజుల పాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో రైతులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు కూడా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు తెలిపారు.

## కరీంనగర్ మున్సిపల్ డివిజన్ల డిలిమిటేషన్‌పై అనేక అనుమానాలు !

-ఇంటి నంబర్లు , హద్దుల పై స్పష్టత ఇవ్వాలి...

-బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు...



**కరీంనగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ల డిలిమిటేషన్ పై అనేక డౌట్స్ ఉన్నాయని బిజెపి పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ లో లోగోడ ఉన్న 60 డివిజన్లను 66 డివిజన్లుగా విభజిస్తూ రూపొందించిన ముసాయిదా పై అనేక సందేహాలు, అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఇంటి నెంబర్లు , హద్దుల విషయంలో ప్రస్తుతం రూపొందించిన ముసాదాలో ఇంటి నంబర్లు , హద్దులు ఏ ప్రాతిపదికన ఏర్పాటు చేశారో అర్థం కాకుండా గందరగోళంగా ఉందన్నారు. అందుకే మున్సిపల్ అధికారులు రూపొందించిన ముసాయిదా జాబితా పై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డివిజన్ల విభజన మొదలుకొని, కొన్ని డివిజన్లో అత్యల్పంగా , మరికొన్ని డివిజన్లో అధికంగా ఓటర్లను ఎందుకు చూపెట్టారో వివరించాల్సిన అవసరం ఉందన్నారు . డివిజన్లో విభజన , ఓటర్ల సంఖ్య పై శాస్త్రీయంగా జరిగిందా అనే విషయంపై ప్రజలందరికీ అనుమానాలు ఉన్నాయని , దీన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపైనే ఉందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి ప్రత్యేక చొరవ తీసుకొని నగర ప్రజలందరికీ ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పనులపై కలెక్టర్ సమీక్ష .

-త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



**వనపర్తి,జూన్ 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

వనపర్తి పట్టణంలో పెండింగ్ లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్ లో పట్టణంలోని పెండింగ్ అభివృద్ధి పనులపై మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో కమిషన్ నిర్వహించారు. పట్టణంలో ఇప్పటికే నిధులు మంజూరై పనులు పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లను ఆదేశించారు. కళాభవన్, మినీ ట్యాంక్ బండ్, అమ్మ చెరువు, నల్లచెరువు అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో చేపట్టాల్సిన డ్రైనేజీలు, చిట్యాల రోడ్డు, అప్పాయిపల్లి రోడ్డు తదితర పనుల పురోగతిపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరగా పూర్తిచేసి విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ డి ఈ శ్రీనివాస్, ఎ. ఈ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

## ఇర్విన్ రైతు వేదికలో శాస్త్రవేత్తల కార్యక్రమం

- రైతులకు విలువైన సూచనలు




**మాడుగుల, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మాడుగుల మండలంలోని ఇర్విన్ గ్రామ రైతు వేదిక వద్ద రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ రైతులకు పంటల సాగు, విత్తన ఎంపిక, నీటి యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి,చీడపీడల నివారణ,నేల సంరక్షణ,చెట్లను నాటడం ద్వారా కలిగే లాభాలు వంటి అంశాలపై శిక్షణ పొందారు. వ్యవసాయ విస్తరణ అధికారి రాజేష్ నాయక్, ప్రియాంక, జోష్న భార్గవి, గురు ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి



**కరీంనగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డాక్టర్ కవ్వంపల్లి నేతృత్వంలో కాంగ్రెస్ పెద్దలను కలిసిన మాదిగ ఎమ్మెల్యేలు
మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ లకు వినతిపత్రాలు అందచేశారు. త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు చోటు కల్పించాలని మాదిగ సమాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో ఎమ్మెల్యేలు మందుల సామెల్ (తుంగతుర్తి),అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ధర్మపురి),తోట లక్ష్మీకాంతరావు (జుక్కల్ ), కాలె .యాదయ్య(చేవెళ్ల) ఢిల్లీ లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ను విడివిడిగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆరు స్థానాల్లో భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కసరత్తు చేపట్టారని, ఈ మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారమే కాకుండా సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాదిగలు 33 లక్షల మంది ఉన్నారని, తాజా లెక్కల ప్రకారం ఆ సంఖ్య రెట్టింపైన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ లెక్కన మాదిగలకుమంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. మంత్రివర్గ విస్తరణలో తమకు న్యాయం జరుగుతుందని మాదిగలు ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించేలా చూడాలని వారు కోరారు. మాకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూరుతుందని, 30 సంవత్సరాలుగా నానుతూ వచ్చిన ఎస్సీ వర్గీకరణ సమస్యపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘంతోపాటు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్ అధ్వర్యంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటుచేసి వేగంగా న్యాయంచేశారని, అలాగే మంత్రివర్గ విస్తరణలోనూ మాదిగలకు న్యాయం చేయాలని కోరారు.

## చెట్టు = అమ్మ
## చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.
**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.
చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

## మానేరు పర్యావరణ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**కరీంనగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పర్యావరణంలో మౌలిక అంశాలైన గాలి, నీరు, నేల ప్లాస్టిక్ సంచుల కాలుష్యంతో జీవుల మనుగకు ముప్పు ఏర్పడుతుందని పూర్వకాలం ఉపయోగించిన బట్ట లేదా , జానపనార సంచులను పర్యావరణ పరిరక్షణ కొరకు మనమందరం వాడాలని మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణ రావు అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం స్థానిక వైశ్య భవనం లో గన్ని బ్యాగులను ప్రదర్శించి ఆయన మాట్లాడుతూ పలుచని ప్లాస్టిక్ సంచులు పీడనం మరియు ushno-gratha ల వద్ద చెరిగిపోయి సూక్ష్మ కణాలుగా గాలిలోనికి వెదజల్ల బడి భూతపాన్ని పెంచుతాయి కలుషితమైన ఈగాలిని పీల్చడం వలన శ్వాశకోశ వ్యాదులు నాడిమండల వ్యాధులకు దారి తీస్తాయి ప్లాస్టిక్ కణాలు గాలినుండి భూమికి చేరి పచ్చని పంటపొలాలలోని జీవసారం నశించి పంటదిగుబడులు తగ్గిపోతాయి. కలుషితమైన నీటిని త్రాగి సున్నితమైన జీవజాతులు అంతరించిపోతాయాని అన్నారు. సంస్థ సహ అధ్యక్షులు పెద్ది లక్ష్మి నారాయణ మాట్లాడుతూ అథి తులకు శుభకర్యాలలో గన్ని బ్యాగులనే బహుమతిగా ఇవ్వాలని అన్నారు సంచులను పంచారు. వైశ్య సేవ కేంద్రం అధ్యక్షులు చిదుర సురేష్ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కన్న కృష్ణ, సామ నారాయణ,పెద్ది రామన్న, కొమురవెల్లి వెంకటేశం, నలుమాచు సుదర్శన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు బీజేపీ నేతల కృషి



**కుత్బుల్లాపూర్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కన్వీనర్ ఎస్. మల్లారెడ్డి ఆదేశాల ప్రకారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు యం.ఎస్. వాసు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శాంపూర్ విజయేందర్ రెడ్డి, డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీమతి కళ్యాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. వాసు మాట్లాడుతూ, "మోడీ మాతృమూర్తి పేరిట ఒక మొక్కను నాటండి, ఆ మొక్కను సంరక్షించండి"అంటూ ఇచ్చిన పిలుపు మేరకు తలా ఒక మొక్కను నాటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, భవిష్యత్ తరాలకు హరిత ప్రపంచాన్ని అందించేందుకు మొక్కలు నాటడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## వాసవి వనిత క్లబ్,వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం






**కరీంనగర్,జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్ ):**
జై వాసవి.. జై జై వాసవి నినాదాలతో ప్రకృతి పరిరక్షణకు పూనుకున్నారు వాసవి వనిత క్లబ్ & వాసవి కపుల్స్ క్లబ్ సభ్యులు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆక్సిజన్ పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాసవి వనిత క్లబ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి రజిత, వాసవి కపుల్స్ క్లబ్ & కె.ఎస్.ఆర్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్ నేతృత్వం వహించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు, పర్యావరణ ప్రేమికులు, పార్కు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వదేశీ జాగరమంచ్ డిస్టిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అమర్నాథ్ మాట్లాడుతూ "చెయ్యి చెయ్యి కలుపుదాం□ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం .. పర్యావరణాన్ని రక్షించుకుందాం□ భావితరాలకు కాపాడుదాం" అంటూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని ప్రజలను ఉద్దేశించారు. పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ మిల్లీ ప్రయత్నించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పిలుపునిచ్చారు. భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలంటే ఈ రోజు నుంచే బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**- జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్**
**- పంజుగుల గ్రామ రెవెన్యూ సదస్సు లో ఆకస్మిక తనిఖీ**



**కల్వకుర్తి, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి మండలం లోని పంజుగుల గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును గురువారం ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించారు.. గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను స్వయంగా సందర్శించి, అక్కడ వచ్చిన ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులతో ముఖాముఖిగా చర్చలు జరిపిన కలెక్టర్, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను సవివరంగా తెలుసుకొని, తక్షణమే పరిష్కరించాల్సిన అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సు లో ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో, అవి ఆన్‌లైన్‌లో నమోదు అవుతున్నాయా?, అనే అంశాలపై అధికారులను ప్రశ్నించారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియలో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రసీదులు ఇవ్వాలని, సంబంధిత రిజిస్టర్లలో స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సదస్సుల హెల్ప్ డెస్క్ లను, నమోదు పత్రాలను, విభజన విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, సమస్యల ప్రకారంగా దరఖాస్తులను వర్గీకరించి, పక్కాగా రికార్డులు తయారుచేయాలని సూచించారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని చెప్పారు. జూన్ 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూములపై సమస్యలు ఉన్న ప్రజలు ఈ సదస్సులను వినియోగించుకొని, తమ అర్జీలను సమర్పించాలని ఆయన సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూసే ప్రజలందరూ హాజరై, భూ భారతి రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు, ఏదైనా సమస్య పరిష్కారానికి నిబంధనలు అనుమతించని పక్షంలో, దాని కారణాన్ని దరఖాస్తుదారుడికి స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూసుకోవాలని ఆదేశించారు రెవెన్యూ సదస్సుల అనంతరం క్షేత్రస్థాయిలో విచారణ అవసరం ఉండే సమస్యలపైనా నిశితంగా దృష్టి పెట్టాలని, వివరాల నమోదు సరిగ్గా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన వారికి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలన్నారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం, రెవెన్యూ అధికారులు గ్రామ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీ ఘటనలో 12 మందికి రిమాండ్



**రాజోలు, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోలు మండలం పెద్ద ధన్వాడ వద్ద ఇథనాల్ ఫ్యాక్టరీపై దాడి ఘటనలో 12 మందిని రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు మొత్తం 40 మందిని అదుపులోకి తీసుకోగా 28 మందిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు మరో ఐదుగురికి నోటీసులు అందజేశారని తెలిపారు దాడికి బాధ్యులైన వారిని వీడియోల ఆధారంగా గుర్తించి వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండించాలి



కల్వకుర్తి, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్): కల్వకుర్తి పట్టణం లోని రైతు వేదిక నందు పాలెం కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రాజశేఖర్,రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సంబంధిత అంశాలపై ఎలా సద్వినియోగం చేసుకోవాలీ, ఎలా అందిపుకుచ్చుకోవాలో అవగాహన కల్పించారు. పంటలకు పురుగు, తెగులు మందుల వాడుకం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ, యూరియా వాడకం తగ్గించి అధిక దిగుబడి సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి వినియోగం అధికంగా ఉండే ప్రాంతాల్లో పంటలను సాగు చేయడం, భూసారా పరీక్షలు ,పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు..కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకట్ రెడ్డి, సురేష్, విస్తరణ అధికారి చందన,రైతులు పాల్గొన్నారు.

## ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో డీడీ కాలనీ శ్రీచైతన్య కళాశాలకు ర్యాంకుల పంట



హైదరాబాద్,జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అంబర్పేటలోని శ్రీచైతన్య కళాశాల అకడమిక్ డీన్ శ్రీవనరెడ్డి అన్నారు. ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పలు కేటగిరీల్లో సత్తా చాటిన విద్యార్థులను సన్మానించిన అనంతరం నిర్వహించిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా కృషి చేస్తే సాధించలేనిదంటూ లేదని తెలిపారు. ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ 2025 పరీక్షలో డీడీ కాలనీకి చెందిన శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ 2025 పరీక్షలో డీడీ కాలనీకి చెందిన శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. సోమవారం ప్రకటించిన ఆల్ ఇండియా ఐఐటి జేఈఈ అడ్బాన్స్ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించినందున సంబరాలు నిర్వహించారు. వివిధ కేటగిరీల్లో ఆల్ ఇండియాలో మెండే లక్ష్మీభార్గవ్, వంగా ప్రవాసరెడ్డి, ఐతగాని నీరజ్కుమార్, కొడవలి కార్తికేయ నాయుడు, దోమ సృజన్ హసిత్రెడ్డి, షేక్ సౌమ్యుద్దీన్ లు వరుసగా 16, 25, 28, 57, 88, 105, 153, 310, 349, 473, 504, ముగ్నిలుజి 611, 624, 661, 680, 732, 858, 997 ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ డీన్ శ్రీవనరెడ్డి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. పదివేల లోపు వందకు పై చిలుకు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు సతీష్, అంకిరెడ్డి, అసోసియేట్ డీన్ ఉదయ్ కిరణ్, మణికంఠ, ప్రిన్సిపాల్స్ సుజాత, తిరుపతి, నరసింహ, వల్లీ మాధవి, బాలరాజు, సంతోష్, రమణారెడ్డి, భానుప్రకాష్, అరుణామాధురి, మహేష్, పరమేశ్వర్, కృష్ణ, శారదా, డి.శ్రీనివాస్, ఆశాలత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల టాపర్‌ను అభినందించి మొక్కలు నాటిన ఎంపీడీవో బ్రహ్మాచారి




వంగూరు, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్) వంగూరు మండలంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పర్యావరణాన్ని రక్షించేందుకు ముందుకు రావాలని ఎంపీడీవో గన్నోజు బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. వెంకటాపూర్ గ్రామ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వంగూరు జిల్లా పరిషత్ హై స్కూల్ బాయ్స్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్సి ఫస్ట్ ర్యాంక్ సాధించిన మరియు మండల టాపర్‌గా రెండో స్థానంలో నిలిచిన కటికచర్ల దిలీప్ కుమార్ ను చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆ విద్యార్థి చేత మొక్కలు నాటించడం జరిగింది. దిలీప్ కుమార్ మండలంలో సెకండ్ టాపర్‌గా నిలిచి తన తల్లిదండ్రులకే కాకుండా గ్రామానికి గర్వకారణంగా నిలిచాడని ఎంపీడీవో బ్రహ్మాచారి అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని,పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జడ్పిహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో ఎస్ఎస్సి ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థి కూడా ప్రభుత్వ నర్సరీ ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ రేపటి తరానికి ఎంతో అవసరమని,విద్యార్థులు మార్గదర్శకంగా నిలవాలని ఎంపీడీవో బ్రహ్మాచారి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజేష్ నాయక్, ప్రియాంక, జోష్న భార్గవి, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో నాగర్ కర్నూల్ పార్లమెంటరీ పార్టీ సమీక్ష సమావేశం



హైదరాబాద్, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) హైదరాబాద్ గాంధీభవన్‌లో నాగర్ కర్నూల్ పార్లమెంటరీ పార్టీ సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ,ఏఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్,రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఏఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, ప్రజలకు, పార్టీకి, ప్రభుత్వానికి మరింత సమన్వయం పెంచేందుకు నాయకులు కృషి చేయాలని సూచించారు. రాజ్యాంగ పరిరక్షణ,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం,రాబోయే ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని అనుకూలంగా మలచుకోవడం వంటి అంశాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్నబియ్యం పంపిణీ, భూభారతి వంటి ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల్లో సానుకూల స్పందన వస్తోందని తెలిపారు. పార్టీ నేతలు సమన్వయంతో పని చేయాలని,సీనియర్లు, జూనియర్లు కలిసి ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్,పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇన్‌చార్జులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా

-కసిరెడ్డి నారాయణ రెడ్డి



కల్వకుర్తి, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్): కల్వకుర్తి మున్సిపల్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వన మహోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. అక్కడి నుండి పోలీస్ స్టేషన్ ముందు మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి వృత్తుల స్టాల్స్ ను ఎమ్మెల్యే సందర్శించి, కొనుగోలు చేశారు.వారు మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపారాలు చేసే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లను నిషేధించి,గోనె సంచుల బ్యాగులను వాడాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని భగత్ సింగ్ తండాలో 15 లక్షల రూపాయలతో మురుగు కాలువ నిర్మాణానికి, కేశవ నగర్ కాలనీలో 25 లక్షల రూపాయలతో సైడ్ డ్రైనేజీ ఏర్పాటుకు,10 వ వార్డు రాఘవేంద్ర కాలనీలో 22 లక్ష రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, బాల్ రాం నగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం తో పాటు 08 వ వార్డు సుభాష్ నగర్ కాలనీలో 25 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 10 లక్షల రూపాయలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మొత్తం 1 కోటి 50 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు ఆనంద్ కుమార్,సుదర్శన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, నాయకులు సంజీవ్ కుమార్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,కాలనీ వాసులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ హెచ్చరిక



నాగర్ కర్నూల్ జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్) కల్వకుర్తి పట్టణంలోని పలు రైస్ మిల్లులను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణ సమీపంలోని సద్గురు రాఘవేంద్ర పారా బాయిల్డ్ రైస్ మిల్లును పరిశీలించి, ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించారు. కలెక్టర్ ధాన్యం దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్ యజమానికి సూచించారు. ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఉమామహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూ సర్వే వద్ద రైతుల నిరసన



బల్మూర్, జూన్ 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండల పరిధిలో ఉమామహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఫేజ్ 1 కోసం భూ సర్వే చేపట్టిన అధికారులకు రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. పేద ప్రజల భూములను లాక్కోవడం ఏమిటి అంటూ రైతులు అధికారులను నిలదీశారు. తమ భూములు తమకే ఉండాలని ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన రైతులు స్పష్టం చేశారు. భూములు కోల్పోతే తమ పిల్లలు అనాధలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సర్వేను నిలిపివేయాలని లేకపోతే ఎకరాకు 20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. వర్షాకాలం సీజన్ లో ఇలాంటి భూ సర్వేలు చేపట్టడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని వారు పేర్కొన్నారు. తమ ప్రాణాలను అడ్డుపెట్టి భూములను రక్షించుకుంటామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భూ సర్వేను నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రెస్ కాలనీలో ఉప్పు సత్యనారాయణ పుట్టినరోజు సంబరాలు





ఎల్బీనగర్, జూన్ 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్) ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రెస్ కాలనీలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. కాలనీవాసులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు ఉప్పు సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేకును కట్ చేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ అప్పటికప్పుడు వచ్చిన ఆలోచనతో నిరంతర శ్రమజీవులు జంపాల నరేష్, సైదిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమాన్ని రూపొందించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను కొనసాగించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ప్రతి సంవత్సరం కనీసం వారం పాటు కుల మత ప్రాంత పార్టీలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు.